ప్రజాశక్తి
మంగళవారం 27 డిసెంబర్ 2022 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

నేడు వైపాలెంకు సిఎం జగన్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మంగళవారం యర్రగొండపాలెం రానున్నారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాతృమూర్తి థెరిసమ్మ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి సురేష్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి యర్రగొండపాలెంలోని క్యాంపు కార్యాలయానికి రానున్నారు. ఈ సందర్భంగా థెరిసమ్మ చిత్రపటానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నివాళులర్పించనున్నారు.

మంత్రి సురేష్ మాతృమూర్తి థెరిసమ్మ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఇన్‌సెట్లో థెరిసమ్మ (ఫైల్)

మంత్రి సురేష్‌కు మాతృవియోగం

జార్జి విద్యాసంస్థల చైర్మన్ 'థెరిసమ్మ' మృతి

8లో

పింఛన్లకు మంగళం

- బాపట్ల జిల్లాలో రద్దు కానున్న 4453 పెన్షన్లు
- ఒక్క చీరాలలోనే 641 నిలుపుదల చేస్తూ నోటీసులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నిబంధనల పేరుతో పింఛన్లను తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లాల వారీగా ఇప్పటికే అధికారులు జాబితాను సిద్ధం చేశారు. రద్దు చేసే పింఛన్ల జాబితాలను సచివాలయాలకు పంపారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు నోటీసులు ఇస్తున్నారు. నోటీసులు చూసిన లబ్ధిదారులు బోరుమంటున్నారు. జనవరిలో రూ.250 అదనంగా పెంచుతారని ఆశపడ్డామని, ఇప్పుడు ఉన్న పింఛన్ ఎత్తేస్తే ఎలా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెల నుంచి పింఛన్‌ను రూ.250 పెంచి.. మొత్తం రూ.2750 ఇస్తామని చెబుతున్న ప్రభుత్వం.. మరో వైపు నిబంధనల పేరుతో కొన్ని పింఛన్లను తీసేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ క్రమంలో బాపట్ల జిల్లాలో 4,453 మందిని నిబంధనల మేరకు అనర్హులుగా ప్రకటించి.. వీరికి పింఛన్ నిలుపుదల చేస్తూ నోటీసులు పంపారు. ఇలా ప్రతి సచివాలయం నుంచి 20 నుంచి 40 వరకు పింఛన్లు రద్దయ్యాయి. ఒక్క చీరాల పురపాలక సంఘం పరిధిలో ఇలా 641 మంది పింఛన్లు నిలుపుదల చేస్తూ నోటీసులు ఇచ్చారు. గత ప్రభుత్వ హయాం కన్నా ముందు నుంచి పింఛన్లు పొందుతున్న వారికి కూడా పింఛన్లు నిలుపుదల చేస్తూ ఈ నెల 21 నుంచి సచివాలయాల వారీగా నోటీసులు ఇచ్చారు. సదరు నోటీసుల్లో వారి కుటుంబాల వివరాలను పరిశీలించిన మీదట పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా 2019 డిసెంబరు నెలలో ఇచ్చిన జివో ఎమ్ ఎస్ నెంబరు 174 ప్రకారం మీరు పింఛన్ పొందేందుకు అనర్హులుగా గుర్తించినట్లు పేర్కొ న్నారు. పింఛన్‌దారుల కుటుంబంలో ఎవరికయినా ఫోర్‌వీలర్ ఉన్నా, వారు ఉంటున్న ఇల్లు వెయ్యి చదరపు అడుగుల పైన ఉన్నా, సరాసరి విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటినా, 3 ఎకరాల మాగాణి లేదా 10 ఎకరాల మెట్ట వరకు ఉన్నా వారి పింఛన్‌ను నిలుపుదల చేశారు.

రద్దయిన 4,453 పింఛన్లలో 1,747 మందికి సంబంధించి గహాలకు 300 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. 10 ఎకరాల భూమి ఉన్న వారు 738 మంది, నాలుగు చక్రాల వాహనం ఉన్న వారు 107 మంది, మిగిలిన కారణాలతో మరికొంత మంది అనర్హుల జాబితాలోకి వెళ్లారు. వీరిలో ఎక్కువమంది తమకు పింఛన్ పొందేందుకు అర్హత ఉందంటూ తగిన వివరాలతో సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వారి నుంచి దరఖాస్తులు తీసుకున్న సచివాలయ సిబ్బంది ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నారు. ఇదంతా పూర్తి కావడానికి చాలా కాలం పడుతుంది. దీంతో నూతన సంవత్సరంలో వేలాది మంది తమ పింఛన్‌ను కోల్పోతున్నారు. ప్రభుత్వం స్పందించి.. అర్హులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవలసి ఉంది.

కుమారుడు కారు కొనడంతో..

కారంచేడు గ్రామానికి చెందిన గుంజి సుబ్బులుకు పింఛన్ తీసేస్తున్నట్లు నోటీసు వచ్చింది. ఆమె కుమారుడికి వివాహమై.. వేరే చోట పట్టణంలో ఉంటున్నారు. రుణం పొంది కారు కొనుక్కున్నారు. వీరి పేర్లన్నీ ఒకే రేషన్‌కార్డులో ఉండటంతో ఇక్కడ ఉంటున్న తల్లి పింఛన్ రద్దవుతోంది.

కోవిడ్ ముప్పు తప్పదా?

- జాగ్రత్తలపై ఇంకా కనిపించని స్పందన
- జనం భారీగా కూడే కార్యక్రమాలపై నిఘా పెడితేనే ఫలితం!

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కోవిడ్‌పై మళ్లీ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రప్రభుత్వం కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలిచ్చింది. కలెక్టర్లకు మార్గదర్శకాలు ఇచ్చారు. వైద్యశాఖను అప్రమత్తం చేశారు. కోవిడ్ కొత్త వేరియంట్లు వస్తున్నాయనే ప్రచారాలు తీవ్రంగా ఉన్నాయి. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఇప్పటికే ఆసుపత్రులను సిద్ధం చేశారు. బెడ్లను ఏర్పాటు చేస్తున్నారు. మూడో దశలో అనుకున్నంత ప్రమాదంగా లేనందున జనంలో కొంత ఉదాసీనత పెరిగింది. కరోనా భయం తగ్గింది. రెండో దశలో ప్రాణాలను తీసేసింది. మూడో దశకు వచ్చే సరికి వైరస్ తీవ్రత తగ్గింది. సోకినా అందరూ కోలుకున్నారు. మరణాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ కొత్త వేరియంట్ వచ్చిందని వైద్యశాఖ అప్రమత్తమైంది. పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జనంలో కరోనా జాగ్రత్తలపై ఇంకా స్పందన లేదు. జాగత్తలు కొంచెమైనా తీసుకోవడం లేదు. కలెక్టర్ రెండు రోజుల క్రితం మీడియా సమావేశం ఏర్పాటు చేసి కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలని, భౌతికదూరం పాటించాలని కోరారు. మాస్కులను ధరించాలని వైద్యశాఖ హెచ్చరిస్తోంది. అయితే జిల్లాలో కేసుల నమోదు కనిపించకపోవడంతో జనంలోనూ చలనం లేదు. దానిపై భయం పెద్దగా రావడం లేదు. వస్తే అదే పోతుందనే చర్చ కూడా జనంలో పెరిగింది. దీన్ని నిర్లక్ష్యం చేస్తే ముప్పు తప్పదని వైద్యశాఖ హెచ్చరిస్తోంది. ఇప్పటికీ కొన్ని దేశాల్లో జాగ్రత్తలు తీసుకున్నా వైరస్ అదుపులో ఉండటం లేదు. ఇక్కడ ఏ జాగ్రత్తలూ తీసుకోకుంటే వైరస్ వస్తే అదుపు చేయగలమా? అనేదీ ఆలోచించాల్సిన అవసరం ఉంది. జనం భారీగా గడప గడపకూ ప్రభుత్వంలో గుమికూడుతున్నారు. పార్టీ కార్యకర్తలు వార్డుల్లో జనంతో కలిసి వందలాది మంది ర్యాలీలు చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది కూడా భారీగానే ఎమ్మెల్యేల వెంట నడుస్తున్నారు. ఇంటింటికీ తిరిగే క్రమంలో గుంపులుగుంపులుగా దూరం లేకుండా ఉంటున్నారు. రాజకీయ పార్టీల కార్యక్రమాల్లోనూ భారీగానే జనం కూడుతున్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే అమెరికా, ఇతర దేశాలకు ఉన్నత చదువుల కోసం వెళ్లే విద్యార్థులు కూడా కరోనాపై కలవరం చెందుతున్నారు. చైనాతో పాటు అనేక దేశాల్లో వైరస్ తీవ్రంగా ఉంది. అక్కడ పరిస్థితులపైనా ఆందోళన తప్పడం లేదు.

ఏ పథకమూ రాలేదయ్యా..!

- రేషన్‌కార్డుపై వచ్చే ఐదు కిలోల బియ్యమే దిక్కు
- ఎమ్మెల్యే బాలినేని ఎదుట ఓ ఒంటరి మహిళ ఆవేదన

బాలినేనికి సమస్య చెప్పుకుంటున్న ఒంటరి మహిళ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

'ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకమూ రాలేదు. భర్త వదిపెట్టి వెళ్లిపోయాడు. ఇద్దరు ఆడబిడ్డలను సాకి పెళ్లిలు చేశా. ఒంటరిగా ఉంటున్నాను. ఒంటరి మహిళ పింఛన్ పెట్టాలని అడిగితే అధికారులు రెండు సార్లు కాగితాలు తీసుకొని పోయారు. అయినా ఫించన్ రాలేదు. చేయూత పథకానికి పెట్టాను. అది కూడా రాలేదు. ప్రతినెలా తెల్లకార్డుపై ఐదు కేజీల రేషన్ బియ్యమిస్తారు. అదే ఆదరువు. ఏం కష్టమొచ్చినా భగవంతుడే ఉన్నాడని బతుకుతున్నా.. మిమ్మల్ని అడగొచ్చో..లేదో..నాకు తెలీదు. నా లాంటి వాళ్లకు కూడా ఫించను ఇస్తారంట కదా.! అది కాస్త ఇప్పించి పుణ్యం కట్టుకోండయ్యా' అంటూ నగరంలోని 33వ డివిజన్ మిలటరీకాలనీలో నివాసముంటున్న మన్నేపల్లి సంపూర్ణ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి 33వ డివిజన్‌లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని సంపూర్ణ ఇంటికి వెళ్లి సమస్యలు చెప్పాలని అడిగారు. అందుకు స్పందించిన సంపూర్ణ తనకు ఎలాంటి పథకాలూ రాలేదని, భర్త వదిలేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే నాలుగు కిలోల బియ్యమే ఆధారమని, కూలీనాలీ చేసి పొట్టపోసుకుంటున్నానని వివరించారు. ఆరోగ్యం సక్రమంగా ఉండటం లేదని ఆవేదన చెందారు. ఒంటరి మహిళ ఫించను ఇప్పించాలని కోరారు. ఒంటరి మహిళ ఫించన్ రాకపోవడానికి గల కారణాలను ఎమ్మెల్యే ఆరా తీయగా అనేక సాంకేతిక కారణాలు సచివాలయ సిబ్బంది చెప్పుకొచ్చారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించి.. ఆమెకు పింఛను వచ్చేలా చూడాలని ఎమ్మెల్యే సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం ఫించను మంజూరు చేసే వరకూ ప్రతినెలా లాయర్ పేటలోని తన ఆఫీసులో ఫించను తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

బాలినేనికి ఘనస్వాగతం..

గడపగడపకూ మన ప్రభుత్వం ▶ 2లో

ఏ పథకమూ రాలేదయ్యా.!

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి నియంత కుమారి, పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారి నివాసంలో అల్పాహారం తీసుకున్న బాలినేని శ్రీనివాసరెడ్డి మిలటరీ కాలనీ, యానాదిసంఘం ప్రాంతాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరి బుజ్జి, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇంజినీర్ కె మాల్యాద్రి, డిఇఇ గణపతి, ఎఇ అంజిరెడ్డి, 33వ డివిజన్ వైసిపి నాయకులు షేక్ రషీదా, నాగూర్, పందిటి జేమ్స్, జయరాంరెడ్డి, నాగిరెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి విజయసుధాకర్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, బిసిసెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, వైసిపి రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి దామరాజు కాంత్రికుమార్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న బాలినేని శ్రీనివాసరెడ్డి 33వ డివిజన్ మిలటరీకాలనీ ప్రాంతంలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న సిసిరోడ్డు, సిసి డ్రెయిన్, బిటి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

'ఇదేమి ఖర్మ' కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కందుల

రాష్ట్రంలో వైసిపి దుర్మార్గపు పాలన

మాజీ ఎమ్మెల్యే కందుల

ప్రజాశక్తి-కొనకనమిట్ల

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం దుర్మార్గపు పాలన సాగిస్తుందని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వాగుమడుగు, బోడపాడు, అంబాపురం గ్రామాలలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల నారాయణ ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ప్రజలు సుఖసంతోషంతో లేరని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ఎస్‌సిలకు సబ్సిడీపై రుణాలు అందజేసినట్లు తెలిపారు. వైసిపి హయాంలో ఎస్‌సిలకు సబ్సిడీపై ఒక్క రూపాయి కూడా అందజేయలేదని తెలిపారు. ఎస్‌సిల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు మోరబోయిన బాబూరావు, రత్నం, అంకాల రోశయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

దోర్నాల మండలం చిన్న దోర్నాలలో వాలంటీర్‌గా పని చేస్తున్న కోటేశ్వరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుంది. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కోటేశ్వరి భర్త యేసేబు సాయం చేయమని కోరడంతో యర్రగొండపాలెంకు చెందిన 1977-78 పదవ తరగతి బ్యాచ్ కలర్స్ గ్రూపు సభ్యులు అన్నమరాజు మురళీకష్ణ, తుమ్మలపల్లి కోట సుబ్బారావు, జ్యోతి ప్రసాదరావు, చేకూరి చంద్రశేఖర్, మార్కాపురంకు చెందిన బి. శ్రీనివాసులు, బి శివకుమార్ తమ వంతు సహాయంగా రూ. 5000 నగదు అందజేశారు.

ముస్లిములపై దాడులు అరికట్టాలని వినతి

ప్రజాశక్తి-పొదిలి

ముస్లిములపై దాడులను అరికట్టాలని, వక్ఫ్ బోర్డు స్థలాలను కాపాడాలని కోరుతూ జాయింట్ కలెక్టర్‌కు ముస్లిం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఒంగోలులో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ నరసరావుపేటలో స్థలం విషయంలో షేక్ ఇబ్రహీంను హత్య చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ రసూల్ మహమ్మద్, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు షేక్ కపిల్ బాషా, రాష్ట్రఅధికార ప్రతినిధి షేక్ రఫీ, జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, మైనార్టీ నాయకులు సిద్ధిక్, మున్న, శంషుద్దీన్, మస్తాన్,మహమ్మద్ ఖాన్ మహిళా నాయకురాలు ముంతాజ్, ఆరిఫా,నాసిర, గౌసాని పాల్గొన్నారు.

జేసికి వినతి పత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

వంగవీటి మోహనరంగాకు నివాళి

ప్రజాశక్తి-చీమకుర్తి

కాపు సంఘం ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీనగర్, కంచుకోట బజారులోని వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 300 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. బధిరుల పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆమంచి స్వాములు, జిల్లా నాయకులు గొర్రెపాటి శ్రీను, కాపునాడు మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, పాలగుడు సుబ్బారావు, వైఎస్ ఎంపిపి జ్యేష్ఠ శ్రీనివాసరావు, ఏడుకొండలు, రామబ్రహ్మం, భీమనవెంకటరావు, మోహన్‌రావు, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు,పత్తి కోటేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు. **గిద్దలూరు :** బలిజ సంఘం ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా వర్ధంతి వర్ధంతి నిర్వహించారు. తొలుత శ్రీకష్ణదేవరాయ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వంగవీటి మోహనరంగాకు నివాళుల అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బలిజ సంఘం గౌరవ సలహాదారులు దుత్త బాల ఈశ్వరయ్య, ముద్దర్ల శ్రీనివాసులు, ఆసుల శ్రీనివాసులు, సంఘ అధ్యక్షుడు సుబ్బరంగయ్య, ప్రధాన కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసులు, రాసాకష పాల్గొన్నారు. **పొదిలి :** వంగ వీటి మోహన్ రంగా వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముని శ్రీనివాసులు, పొకల శ్రీను, పొకల యలమంద, మారాబత్తిన స్వాములు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

టిడిపిలో ఫ్లెక్సీల రచ్చ

ఇరుగ్రూపుల మధ్య తోపులాట

ప్రజాశక్తి- శింగరాయకొండ

శింగరాయకొండ వద్ద జాతీయ రహదారి ప్రక్కన ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే విషయంలో టిడిపిలోని రెండు గ్రూపుల మధ్య రచ్చ జరిగింది. చివరకూ రెండు గ్రూపుల నాయకుల మధ్య తోపులాట జరిగింది. మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం కందుకూరు నియోజక వర్గంలో పర్యటించనున్నారు. అందులో భాగంగా టిడిపి కందుకూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఇంటూరు నాగేశ్వరరావు, టిడిపి నెల్లూరు పార్లమెంట్ నాయకుడు ఇంటూరు రాజేష్ గ్రూపుకు చెందిన వారు పోటా పోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. శింగరాయకొండలోని కందుకూరు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఇంటూరు రాజేష్ ఖాళీ స్థలం కనిపించకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడు. ఇంటూరు నాగేశ్వరరావు గ్రూపుకు చెందిన వారి వారు అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేందుకు రంగంలోకి దిగాడు. ప్రక్క పక్కనే ఎదురెదురుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండతో ఇద్దరు నాయకులు రంగంలోకి దిగారు. తమ ఫ్లెక్సీల ఎదుట మీ ఫ్లెక్సీలు వేస్తారా అంటూ ఇంటూరు రాజేష్ వర్గీయులు ఇంటూరు నాగేశ్వరరావు వర్గీయులతో వాదనకు దిగారు. ఇరుగ్రూపుల నాయకులు అనుచరులు రోడ్డుపై గొడవలు దిగారు. సమాచారం అందుకున్న శింగరాయకొండ ఎస్‌ఐ ఫిరోజా ఫాతిమా, ఎఎస్‌ఐ మహబూబ్ బాషా, ఎస్‌ఎ బెగ్ రంగంలోకి దిగి. ఇద్దరు నాయకుల గ్రూపుల వారితో మాట్లాడారు. పోలీసులు ఎంత సర్ది చెప్పినా వారు వినలేదు. దీంతో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఫ్లెక్సీలు ఏర్పాటుకు ఎవరూ అనుమతి ఇచ్చారంటూ పోలీసులు వారిని ప్రశ్నించారు. శింగరాయకొండ నుంచి కందుకూరు వరరూ ఇంటూరు రాజేష్ ఫ్లెక్సీలు అధికంగా ఉండడంతో ఇంటూరు నాగేశ్వరరావు వర్గీయులు కూడా ఫ్లెక్సీలు వేసేందుకు సోమవారం రాత్రి సిద్ధమయ్యాడు. దీంతో ఇరు గ్రూపుల మధ్య రచ్చ చోటు చేసుకుంది.

టిడిపి నాయకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

గుండ్లకమ్మ

జలాశయం సందర్శన

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని మల్లవరం గ్రామంలోనున్న శ్రీ కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ జలాశయంలో చేప పిల్లలు వదిలేందుకు మత్స్యశాఖ డైరెక్టర్ కె.చంద్రశేఖర్, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు మత్స్యకారులతో కలిసి జలాశయాన్ని సోమ వారం సందర్శించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ డైరెక్టర్ కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ జాలర్ల కోసం గుండ్లకమ్మ జలాశయంలో చేప పిల్లలను వదిలేందుకు తాము జలాశయాన్ని పరిశీలించినట్లు తెలిపారు.

భూసర్వే ప్రారంభం

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం మండలం కంకణాల పల్లె గ్రామ రెవెన్యూ పరిధిలోని సోమేపల్లి, ముడివేమల, కంకణాలపల్లె గ్రామాల్లో భూముల రీ సర్వేను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ భూముల రీసర్వేతో హద్దుల సమస్యలు తొలుగు తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సర్వేర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

సీతారామయ్యకు నివాళి

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఈదుమూడి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు అక్కి సాంబయ్య తండ్రి సీతారామయ్య, పోతవరం గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి పెద్దనాన్న పల్లకి అంకిరెడ్డి సోమవారం మతి చెందారు. సీతారామయ్య, అంకిరెడ్డి మృ దేహాలను ఎంపిపి నలమలపు అంజమ్మ ,కష్ణారెడ్డి ,పోలినేని కోటేశ్వర రావు, మద్దిసాని నాగేశ్వరావు, బొజ్జా డానియల్ ,తోకల శ్రీను తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

డాక్యుమెంట్స్ పోయినవి

గట్టుపల్లి సత్యనారాయణ తండ్రి వీరరాఘవులు, సూరేపల్లి గ్రామము బల్లికురవ మండలం అను నాకు సంబంధించిన ఆస్తి అద్దంకి మండలం అద్దంకి పట్టణం లోని వాసవి నగర్ లో ఉన్న ఖాళీ స్థలం సర్వే నెంబర్ 973/2 లో గల 271చ. గజముల స్థలం.దాని తాలూకు డాక్యుమెంట్ నెం 666/2011 కు చెందిన లింక్ డాక్యుమెంట్లు (1885/2010, 97/2008, 535/2004, 467/2002, 1727/2000,1539/1999- మొత్తం 6) నెల రోజుల క్రితం సూరేపల్లి నుండి అద్దంకి బస్సులో వస్తుండగా సంబంధిత ఫైలు పోయినది. దొరికిన వారు 9492319664 కు తెలియజేయగలరు.

CHANGE OF NAME

I, SMT. PEERAMBI(due to variation in the Army & Civil Documents), R/o Survi Reddy Palli(V), Komarolu(Mdl), Prakasam Dist., Andhra Pradesh, hereby declare the I have changed my name as per Aadhar & PAN Cards as **POTHUKANTI PEERAMBI** W/o POTHUKANTI DASTHAGIRI (No. 15120472Y Rank: HAV(TA). Hence, both names are **one & same.**

గ్రామపంచాయతీ కార్యాలయము
సింగరాయకొండ

ఆర్.ఓ.సి నెం. 02/2021 **టెండర్ నోటీసు** తేది : 21-12-2022

ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం, సింగరాయకొండ గ్రామపంచాయతీ కార్యాలయము నందు నిరుపయోగముగా ఉన్న క్రింది వివరముల దాఖల, శ్రీయుత డివిజినల్ పంచాయతీ అధికారి, వారి ఉత్తర్వులు ఆర్.సి. నెం: 32/2022(పం) ఎ4, తేది: 05-03-2022, మద్దతు ధర మేరకు తేది: 29-12-2022 సాయంత్రము 3.00 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయములో సంభందిత అధికారుల సమక్షములో బహిరంగ వేలం పాట నిర్వహించబడును.

వ నెం.	వివరము	ధరావత్తు
1	పాత ఇనుప సామానులు, 140Kg	1820/-
2	పాత దిన పత్రికలు, 100 Kg	1100/-
3	పాత ట్యూబ్ లైటు ప్లాంకులు, 50 Nos	350/-
4	పాత అల్యూమినియం డీష్ లు, 50 Nos	1150/-

కావున ఆసక్తి కల వారు పైన తెలిపిన వివరముల ప్రకారము పైన తెలిపిన తేదిలో జరుగు బహిరంగ వేలము పాటలో పాల్గొన వలసినదిగా తెలియజేయడమైనది.

సం/- A.శరత్ బాబు
పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయతీ, సింగరాయకొండ.

'గురుకులం' ఘటనపై విచారించాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

పర్చూరు ఎస్టీ గురుకులం పాఠశాలలో జరిగిన సంఘటనపై జిల్లా స్థాయి అధికారులతో సమగ్రమైన విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మనోజ్, ఆర్య సోమవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన పర్చూరు ఎస్టి గురుకులం పాఠశాలలో విద్యార్థులు గంజాయి, మద్యం తీసుకుని కొట్టుకుంటున్న వీడియో రాష్ట్రమంతటా సోషల్ మీడియా ద్వారా వైరల్ అయిన నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా కమిటీ గురుకులాన్నీ సందర్శించామన్నారు. అక్కడ వార్డెన్, ప్రిన్సిపల్, విద్యార్థులతో మాట్లాడి పరిశీలించిన అంశాలను వివరించారు. దీనిపై ప్రభుత్వం పరిశీలించి జిల్లా స్థాయి అధికారులతో కమిటీని వేసి గురుకుల పాఠశాలలో జరిగిన ఘటనలపై సమగ్రమైన విచారణ చేయాలని కోరారు. గురుకులం పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ల మధ్య ఉన్న వ్యక్తిగత విభేదాలను పరిష్కరించాల్సిన ప్రిన్సిపల్ ఖాదర్ వలి వాటిని ప్రోత్సహించడం, కుల వివక్షతో మాట్లాడడం, హాస్టల్ కుక్ కిరణ్, స్కూల్ పిఈటి చంద్రబాబు నాయక్ మధ్య

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, ఆర్య

వ్యక్తిగత వివాదాలు, విద్యార్థుల మీద జరిగిన లైంగిక వేధింపులు వంటి విషయాలను చర్చకు రాకుండా చేయడానికి గురుకులం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను గంజాయి, మద్యం తాగే వారిగా చిత్రీకరించి భావి భారత పౌరుల భవిష్యత్తు మీద నిందలు వేశారన్నారు. ఫలితంగా ఎస్టి గురుకులం పాఠశాల రాష్ట్రవ్యాప్తంగా వార్తల్లోకి ఎక్కడానికి కారణమయ్యిందని పేర్కొన్నారు. అదేవిధంగా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించకుండా ప్రిన్సిపల్ ఖాదర్ వలి విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నాడని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో పిఈటిగా పనిచేస్తున్న చంద్రబాబు నాయక్ మూడు నెలల క్రితం కొందరు విద్యార్థులపై లైంగిక దాడికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఈ విషయంపై నవంబర్ మూడో తేదీన ఒంగోలు చైల్డ్ లైన్ వారికి కంప్లైంట్ వెళ్లగా పాఠశాలలో జరిగిన విచారణలో అది నిజమని తేలిందన్నారు. ఈ విచారణ రిపోర్టును జిల్లా అధికారులకు పంపించగా దీనిపై సత్వరం చర్యలు తీసుకోవాల్సిన జిల్లా అధికారులు వివరణ ఇవ్వాలని డిసెంబర్ 12వ తేదీన పిఈటి చంద్రబాబు నాయక్‌కు నోటీసులు ఇచ్చారు. విచారణ జరిగి నెల రోజులైనా అతని మీద చర్యలు తీసుకోవడంలో జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని పేర్కొన్నారు. చంద్రబాబు నాయక్‌పై ఫోక్సో యాక్ట్ కింద కేసు పెట్టాల్సిన విషయాన్ని సంజాయిషీ కోరుతూ నోటీసులు ఇవ్వడం అంటే దానిని తప్పుదారి పట్టించడానికి ప్రయత్నాలు జరిగాయని అన్నారు. దీనిమీద పూర్తి విచారణ చేయాల్సిన అవసరం ఉంది. ఈ నెల రోజుల క్రమంలో పీఈటి రోజు స్కూలుకు వచ్చి సంబంధిత విద్యార్థులు ఇచ్చిన కంప్లైంట్ వాపస్ తీసుకోవాలని బెదిరింపులకు గురి చేశాడన్నారు. కావున అధికారులు విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మనోజ్, ఆర్య కోరారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-పంగులూరు

కళా ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవడం ద్వారా పలు పథకాలలో లబ్ధి పొందడంతో పాటు, సమాజంలో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండవచ్చునని కో-ఆపరేటివ్ బ్రాంచ్ మేనేజర్ ఎం చెన్నారెడ్డి అన్నారు. మండల కేంద్రం పంగులూరులోని బస్టాండ్ సెంటర్లో సోమవారం కళాజాతా ప్రదర్శన ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాజాతా బృందం సొసైటీ ద్వారా పొందే పథకాల గురించి, కర్షక మిత్ర పథకం గురించి, గోల్డ్ లోన్లు, దీర్ఘకాలిక రుణాలు, క్రాఫ్ట్ రుణాలు, ఆర్‌డి ద్వారా మహిళలకు అధికంగా వడ్డీ వచ్చే పథకాల గురించి తమ బుర్రకథ ద్వారా అందరికీ అర్థమయ్యేలా ఆహ్లాదంగా వివరించారు. మొబైల్లో ఓటీపీలను ఇతరులకు తెలపరాదని, ఏటీఎం కార్డు తదితర రహస్య కోడ్‌లను తెలపడం ప్రమాదకరమంటూ పాటల ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సిహెచ్ శ్రీనివాసరావు, సొసైటీ చైర్ పర్సన్ రావూరి రంగారావు, గుడిపాటి శ్రీనివాసరావు, పోతిన ప్రసాద్, సీఈవో లక్ష్మీదేవి, అస్సాన్ సాహెబ్, ఆదినారాయణ పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎస్‌సిల భూములు ఆన్‌లైన్ చేయాలని ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మూగచింతల ఎస్సీలు

ఎస్‌సిలు సాగు చేసుకుంటున్న భూములను ఆన్‌లైన్ చేయాలని అంబేద్కర్ ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బిళ్లా చెన్నయ్య డిమాండ్ చేశారు. పొదిలి మండలం మూగచింతలకు చెందిన ఎస్‌సిల భూములను ఆన్‌లైన్ చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిళ్ళా చెన్నయ్య మాట్లాడుతూ మూగచింతల గ్రామానికి చెందిన తిరగాబత్తిన రమణయ్య, రవిబాబులకు సర్వే నెంబర్ 48/2లో పట్టా భూమి తాతల కాలం నుంచి 70 ఏళ్ళుగా సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ భూమిని ఎవరికీ అమ్మలేదని, సర్వే నెంబర్ 48/8లో భూమిని కూడా వారు సాగు చేసుకుంటున్నారన్నారు. భూములు ఆన్‌లైన్ చేయాలని కోరుతూ స్పందన కార్యక్రమంలో అక్టోబర్ 17వ తేదీన అర్జీ పెట్టారన్నారు. పొదిలి మండల తహశీల్దార్, స్పెషల్ కలెక్టర్ కూడా భూములను ఆన్‌లైన్ చేస్తామని చెప్పినా నేటి వరకు చేయలేదన్నారు. విచారణ కూడా చేయలేదన్నారు. గ్రామ పెత్తందార్లు ఈ భూములను తమ పేర్లపై ఆన్‌లైన్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఈ విషయాలను గమనించి ఎస్‌సిల భూములను వారి పేర ఆన్‌లైన్ చేయాలని కోరారు. అనంతరం సంయుక్త కలెక్టర్ ఎం అభిషిక్త్ కిషోర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తిరగాబత్తిన రమణయ్య, రవిబాబు పాల్గొన్నారు.

జగన్ రెడ్డి పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారు

ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు

ప్రజలతో మమేకమై సమస్యలు వింటున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

పట్టణంలోని 7వ వార్డులో నిర్వహించిన ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీడీపీ ఇంచార్జ్‌కు, వార్డులోని మహిళలు మంగళ హారతులతో, పూలమాల శాలువాలతో ఘన స్వాగతం పలికారు. అశోక్‌రెడ్డి వార్డులోని మూడు కొళాయిల వీధి, మోహన్ నగర్, కొంగలవీడు రోడ్డు, బిలాల్ మజీద్, లాలప్ప, వీధుల్లోని ఇంటింటికీ తిరిగి మహిళలతో, స్థానిక ప్రజలతో ఆప్యాయతతో మాట్లాడారు మూడున్నరేళ్ల వైసీపీ పాలనలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన సమస్యలను వారి అభిప్రాయాలను రాతపూర్వకంగా నమోదు చేసుకున్నారు. వార్డులో తిరిగిన అనంతరం స్థానిక సమస్యలపై రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మూడున్నర ఏళ్ల జగన్ రెడ్డి పాలనలో అన్నీ వర్గాల ప్రజలు విసుగెత్తి పోయారని, బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనార్టీ, బడుగు బలహీనవర్గాల ప్రజలకు జగన్‌రెడ్డి వెన్నుపోటు పొడిచారని అన్నారు. నాడు తెలుగుదేశం హయాంలో అన్నీ వర్గాలకు సంక్షేమం అందిస్తే, నేడు జగన్ అన్నీ వర్గాలకు సంక్షోభాన్ని మిగిల్చాడు అన్నారు. గిద్దలూరు పట్టణం తెలుగుదేశం హయాంలోనే అభివృద్ధి జరిగిందని, పట్టణంలోని సగిలేరు పరివాహక ప్రాంతాలు ప్రతీ యేటా పడే వర్షాలతో వరదలతో నీట మునిగి ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని ప్రజల సమస్యను సత్వరంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో నాడు తెలుగుదేశం హయాంలో సగిలేరుకు ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి మరియు మరమ్మత్తులకు, రూ.14.50 కోట్లు నిధులను మంజూరు చేయించి, వాటికీ టెండర్లను కూడా పూర్తి చేయించారని, పనులు ప్రారంభం అయ్యేనాటికీ ఎన్నికలు రావటం, ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ పాలకులు ప్రజా సమస్యలను గాలికొదిలేసి, వారి జేబులు నింపుకునే పనులు మాత్రమే చేసుకుంటున్నారని అన్నారు. ఈ మూడున్నరేళ్ల కాలంలో సగిలేరు మరమ్మతులు ఒక్క అంగుళం కూడా ముందుకు సాగలేదని, అకాల వర్షాలతో, సగిలేరు పరివాహక ప్రాంత ప్రజలు భయం గుప్పిట్లో బిక్కు బిక్కుమంటుంటే, పాలకులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరించటం సిగ్గుచేటని అన్నారు. ఈ మూడున్నరేళ్ళ కాలంలో ప్రజామోద యోగ్యమైన పని ఒక్కటి కూడా చేయలేదని, ఈ ప్రభుత్వ నియంత పోకడలకు ప్రజలంతా విసుగెత్తిపోయారని, రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధం అయ్యారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం ఒక్క తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యం అని, అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యలను పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ బిల్లా రామలక్ష్మి, బిల్లా రమేష్ యాదవ్, 2వ వార్డు కౌన్సిలర్, బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్ 3వ వార్డు కౌన్సిలర్ పాలుగుళ్ళ చిన్న శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ పెద్ద మస్తాన్, పార్లమెంట్ అధికార ప్రతినిధి షేక్ మహబూబ్ బాషా, ఉలాపు బాలచెన్నయ్య, కాపు నాయకులు బొజ్జా రంగనాథ్, మండ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన గోడంశెట్టి కుమారి

బైకును ఢీకొన్న ట్రాక్టర్

తల్లి మృతి, కుమారుడికి గాయాలు

ప్రజాశక్తి-పామూరు: బైకును ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో తల్లి మృతి చెందింది. కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని వగ్గంపల్లి గ్రామం వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో పామూరు పట్టణానికి గోడంశెట్టి కుమారి(50) మృతిచెందింది. ఆమె కుమారుడు గోడంశెట్టి నాగేంద్రబాబు గాయపడ్డాడు. తల్లీకొడుకులు బైకుపై కనిగిరి నుంచి పామూరు వస్తుండగా వగ్గంపల్లి గ్రామంవద్ద పొలాల నుంచి పచ్చిగడ్డితో వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో కుమారి అక్కడికక్కడే మృతిచెందింది. నాగేంద్రబాబుకు గాయాలయ్యాయి. గ్రామస్తుల సమాచారంతో ఎస్ఐ సురేష్‌యాదవ్, సిఐ శ్రీనివాసరావు ఘటనా స్థలిని పరిశీలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రిజర్వేషన్ల కోసం 2 నుంచి దీక్ష

ప్రజాశక్తి-ఒంగోలు: కాపులకు వెంటనే ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రకాశం జిల్లా కాపు సంక్షేమసేన అధ్యక్షులు రాయిని రమేష్‌బాబు డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల అమలు కోసం జనవరి 2 నుంచి దీక్ష చేపట్టను న్నట్లు పేర్కొన్నారు. దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఒంగోలులో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మేడిశెట్టి సుబ్బారావు, మహిళా అధ్యక్షురాలు కోసూరు శిరీష, యూత్ అధ్యక్షులు జొన్న వెంకట్, పార్లమెంట్ అధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైసిపి నాయకులు నాగమునీశ్వరరావు మృతి

ప్రజాశక్తి-పిసిపల్లి:

మండలంలోని గుంటుపల్లికి చెందిన వైసిపి నాయకులు, మాజీ డీలర్ డబ్బుగొట్టు నాగ మునీశ్వరరావు (65) ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. నాగ మునీశ్వరరావు మొదటి నుంచి కాంగ్రెస్ వాదిగా ఉన్నారు. మండలంలో చెప్పుకోదగ్గ నాయకుల్లో ఒకరు. నాగమునిగా మండల వాసులకు సుపరిచితులు. ఆయనకు భార్య నాగలక్ష్మి, నలుగురు కుమారులు ఉన్నారు. 2వ కుమారుడు డబ్బుగొట్టు మహేష్‌నాగ్ గతంలో పిసిపల్లి వైస్‌ఎంపిపిగా పని చేశారు. నాగముని అందరితో స్నేహంగా మెలిగేవారు. అదే విధంగా ఆపదలో ఉన్న వారిని రాజకీయాలకు అతీతంగా ఆదుకుంటూ అందరి మన్ననలు పొందారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని కనిగిరి శాసనసభ్యులు బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పిసిపల్లి ఎంపిపి అత్యాల జఫన్య, మురుగుమ్మి ఎంపిటిసి చెరుకూరి సతీష్, వైసిపి నాయకులు ఓకేరెడ్డి, నాగూర్‌యాదవ్, మాజీ సర్పంచులు కేలం సుదర్శనం, మేకల మాల్యాద్రి, వైసిపి నాయకులు బొడ్డుబోయిన వెంకటేశ్వర్లు, గుంటుపల్లి సర్పంచి శేషం పేరమ్మ, శేషం జేమ్స్, నరాల కొండారెడ్డి, నరాల తిరుపతిరెడ్డి, ఉండేలా రంగారెడ్డి తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సుమారు 40 గ్రామాల నుంచి ప్రజలు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న వికలాంగులు, వికలాంగుల సంఘం నాయకులు

వికలాంగుల పింఛన్లు రద్దు చేయొద్దు

ఆర్‌డిఒకు వికలాంగుల మొర

ప్రజాశక్తి-రేపల్లె: వికలాంగులకిచ్చే పింఛన్లు నిలిపివేస్తున్నామని అధికారులు నోటీసులు జారీ చేయడం విచారకరమని ఏపీ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నీలా జోజిబాబు, అరుణశ్రీ వికలాంగుల సంఘం అధ్యక్షులు జానం మురళీకృష్ణ అన్నారు. వికలాంగులకు పింఛన్లు తొలగించడం దుర్మార్గమని వారు పేర్కొన్నారు. సోమవారం బాధితులతో కలిసి రేపల్లె ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. జనవరి నెల నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేయడం కోసం ఉన్న పింఛన్లు రద్దు చేయడం వలన లక్షలాదిమంది వికలాంగుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటాయని, తద్వారా వికలాంగుల జీవితాలు అధోగతిపాలవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక పెన్షన్ల రద్దు నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం పున్ణ సమీక్ష చేయాలని వారు కోరారు.

వికలాంగుల పింఛన్లు రద్దు చేస్తే ఖబడ్దార్..

వికలాంగుల పింఛన్లు రద్దు చేస్తే సహించేది లేదని, వారికి మద్దతుగా జైభీం భారత్ పార్టీ పోరాడుతుందని ఆపార్టీ రేపల్లె నియోజకవర్గ నాయకుడు దోవా రమేష్ రాంజీ, బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ పెనుమాల సుబ్బారావు సంఘీభావాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో పుట్టగుంట గౌతమ్ బుద్ధ, రేపల్లె కోటేశ్వరరావు, కుడితపూడి శ్రీవిద్య, పవిత్ర సాయి, ఎన్ ఓబులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హాకీ పోటీలకు 'హై వెండ్' విద్యార్థులు

ప్రజాశక్తి-కర్లపాలెం: కర్లపాలెం హై వెండ్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఎస్ మనోజ్‌రెడ్డి, తొమ్మిదో తరగతి చదువుతున్న పి శివ మణికంఠ రెడ్డి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు డి ఏసోబు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్ పి చాందిని మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన బాపట్ల జిల్లా హాకీ అసోసియేషన్ వారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీలలో పాల్గొని ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు ఈ నెల 28 నుంచి 30 వరకు వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. సోమవారం పాఠశాలలో అభినంద న సభ నిర్వహించి విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్ గోపిచంద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఉదయ చంద్రారావు, ఉపాధ్యాయులు బాషా, మణిబాబు, హారిక, లత, అనిత, లక్ష్మి, లక్ష్మి లీలావతి పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి-చెరుకుపల్లి: నేటి నుంచి చెరుకుపల్లి మండలంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి శ్రీనివాసరావు తెలిపారు. 27వ తేదీన కుంచలవారిపాలెం, 28వ తేదీన తుమ్మలపాలెం, 29వ తేదీన కావూరు, 30వ తేదీన ఆళ్లవారిపాలెం గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆ గ్రామాల సచివాలయాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిబిరాలలో ఆధార్ కార్డులు మార్పులు చేర్పులు, వేలి ముద్రల అప్‌డేట్, వివిధ సేవలు చేయించుకోవచ్చునని తెలిపారు.

మా ఉద్యోగాలకు రక్షణేది?

మోకాళ్లపై కూర్చుని 108 సిబ్బంది నిరసన

ప్రజాశక్తి-చీరాల

రాష్ట్ర ప్రభుత్వం 108 సిబ్బంది సమస్యలపై స్పందించి తక్షణమే వాటిని పరిష్కరించాలని 108 చీరాల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు కె కమలాకర్, జి చంద్రగిరీష్ కుమార్ డిమాండ్ చేశారు. ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం చీరాల డివిజన్ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో పలు ప్రాంతాలకు చెందిన 108 ఉద్యోగులు, సిబ్బంది తమ వాహనాల వద్ద మోకాపై బైఠాయించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో అత్యవసర సేవలను అందజేస్తున్న 108 ఉద్యోగులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంస్థ నిర్వాహకులు అక్రమంగా వివిధ కారణాలతో విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి తీసుకోవాలన్నారు. 108 సర్వీస్‌లో పనిచేస్తున్న ప్రతి ఈఎంటీకి నెలకు రూ.30 వేలు, పైలెట్లకు రూ.28 వేలు వేతనాలను అమలు చేయాలని కోరారు. ఈ సర్వీసులో 8 గంటల పని సమయాన్ని అమలు పరిచి ఉద్యోగులపై ఉన్న ఒత్తిడిని తగ్గించాలని చెప్పారు. సంస్థ యాజమాన్యం పీఎఫ్, ఐఎస్ఐల నిమిత్తం ఉద్యోగి వాటాను మాత్రమే ఉద్యోగి జీతం నుంచి మినహాయిస్తున్నారని, ఇది చట్టవ్యతిరేకమన్నారు. సరైన కండీషన్‌లో లేని వాహనాల వల్ల బాధితులను చేరుకోవడంలో జాప్యం జరుగుతుందని, అన్ని వాహనాలు కండీషన్లో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ చెల్లింపులతో నిమిత్తం లేకుండా ప్రతి నెలా 1వ తేదీన వేతనాలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు షేక్ ఖాజావలి, జిల్లా జాయింట్ సెక్రటరీ పి కిశోర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు ఎం శ్రీనివాసరావు, నరేంద్ర, పాటిబండ్ల స్కైలాబ్, వింజమూరు శ్రీనివాసరావు, సజ్జా రామకృష్ణ, సునీత్ బాబు, భాస్కర్‌రావు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

108 వాహనాల వద్ద నిరసన తెలియజేస్తున్న సిబ్బంది

అందరికీ అందుబాటులో 'ఐకాన్' సేవలు

ప్రజాశక్తి-చీరాల

పేద మధ్యతరగతి కుటుంబాల అందరికీ ఐకాన్ హాస్పిటల్‌లో అత్యధిక వైద్య సేవలు గత పది సంవత్సరాలుగా అందిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నామని ఐకాన్ హాస్పిటల్ ఎండి డాక్టర్ శంకర్‌శెట్టి కొండలరావు అన్నారు. ఆదివారం స్థానిక హాస్పటల్లో ఐకాన్ హాస్పిటల్ క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. గుంటూరు విజయవాడ వంటి దూర ప్రాంతాలకు వెళ్లకుండానే ఎన్నో అత్యాధునిక శాస్త్ర చికిత్సలను హాస్పిటల్లో విజయవంతంగా పూర్తి చేసామని అన్నారు. చీరాల పరిసర ప్రాంత ప్రజలందరూ తమ హాస్పటల్లో అందిస్తున్న ఆత్యాధునిక వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. కార్యక్రమంలో ఐకాన్ హాస్పిటల్ వైద్యులు సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ఐకాన్ హాస్పిటల్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎండి డాక్టర్ శంకరశెట్టి కొండలరావు

ఆషీస్ హ్యాంగ్ అవుట్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం ఓవి రోడ్‌లోని కనుమల్ల వద్ద సోమవారం నాడు మూలగుంటపాడు మాజీ సర్పంచ్ చుక్కా కిరణ్ కుమార్, ఊళ్లపాలెం ఎంపీటీసీ పురిని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆషీస్ హ్యాంగ్ అవుట్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ చైర్మన్ బత్తుల సుప్రజారెడ్డి ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ రెస్టారెంట్ అభివృద్ధి చెందాలని సూచించారు. కందుకూరు సింగరాయకొండ మధ్యలో ఓవి రోడ్‌లో ఫ్యామిలీ రెస్టారెంట్ ఏర్పాటు చేయడం వల్ల ఎంతోమందికి ఉపయోగపడుతుందని అన్నారు. ఎక్కువమంది బెంగళూరు వెళ్లడానికి ఈ రోడ్డునే వినియోగిస్తున్నారని వివరించారు. త్వరలో జాతీయ రహదారి నిర్మాణం కూడా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ రెస్టారెంట్ ద్వారా వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాపూరి ప్రభావతి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, ఎంపీపీ కట్టా శోభరాణి, దేవస్థానం చైర్మన్ పామర్తి మాధవరావు, షేక్ సలీం బాషా, షేక్ పటేల్, మలినేని వెంకటేశ్వర్లు, షేక్ కరీం, షేక్ మున్నా, ఆరేటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హ్యాంగ్ అవుట్ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్మన్ బత్తుల సుప్రజారెడ్డి

విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు

ప్రజాశక్తి-శింగరాయకొండ: శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉజ్వల ద్వారా మూల గుంటపాడు ఒకటో సచివాలయంలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా బీపీ, షుగర్ ఉన్నవారికి ఉచితంగా మందులు ఇచ్చినట్లు వైద్యులు తెలిపారు. 42 మందికి వైద్యం చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శేషారెడ్డి, ఆరోగ్య పరిరక్షకులు సయ్యద్ మసూద్ అలీ, సిహెచ్‌ఓ తేజస్వి, సుభాకర్, రాధిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టరు

ప్రజాశక్తి దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ అవిష్కరిస్తున్న జేవీవి నాయకులు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ప్రస్తుత సామాజిక, రాజకీయ పోకడల నేపథ్యంలో ప్రజాశక్తి పత్రిక ప్రజలను చైతన్యవంతం చేస్తోందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం వెదుళ్లపల్లి జనవిజ్ఞాన వేదిక ప్రాంతీయ కార్యాలయంలో ప్రజాశక్తి బాపట్ల రూరల్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న జర్నలిజంలో తన పంథాను సుస్పష్టంగా చాటి చెప్పిన ప్రజాశక్తికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేణు, భాగ్యరాజు, నిమ్మల రత్తయ్య, పేరం వెంకటరెడ్డి, నాయుడు నాగేశ్వర్‌రెడ్డి, షేక్ రోషన్ పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపిఆర్‌డి మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు

చెరుకుపల్లి: ప్రజాశక్తి దినపత్రిక ప్రజల పక్షపాతి అని, ఎంపీడీవో బి శ్రీనివాసరావు అన్నారు. ప్రజాశక్తి 2023 క్యాలెండర్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఆవిష్కరించారు. ఇఓపిఆర్ అండ్ ఆర్‌డిజి మురళీ కృష్ణ, గూడవల్లి పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు, కావూరు పంచాయతీ కార్యదర్శి దోగెంద్ర కుమార్, రామ్ బొట్లపాలెం పంచాయతీ కార్యదర్శి విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండరును ఆవిష్కరిస్తున్న బల్లికురవ ఎంపిడిఒ కృష్ణ

బల్లికురవ: నూతన సంవత్సరం సందర్భంగా ప్రజాశక్తి ప్రచురించిన 2023 క్యాలెండరును ఎంపీడీఓ కృష్ణ సోమవారం ఆవిష్కరించారు. ఈఓఆర్‌డి సీతామహాలక్ష్మి, విలేకరి వెంకటరామయ్య, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను అవిష్కరిస్తున్న ఎంపీపీ బాజీ

పిట్టలవానిపాలెం: ప్రజాశక్తి 2023 క్యాలెండర్‌ను పిట్టల వానిపాలెం ఎంపీపీ బాజీ, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ పద్మజ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి బాజీ మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ప్రజలకు ఉపయోగక రంగా ఉంటోందని అన్నారు. సమస్య ఎక్కడ ఉంటే ప్రజాశక్తి అక్కడ ఉంటుందని కొనియాడారు. అనంతరం ఇన్‌ఛార్జి ఎంపీడీఓ పద్మజ మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే మాటను ఈ పత్రిక నిజం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం లో ఏఓ శ్రీనివాసరావు, ఏపిఎం సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పర్చూరులో జాబ్‌మేళా

ప్రజాశక్తి-పర్చూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పర్చూరు బిఏఆర్‌అండ్‌టిఏ జూనియర్ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా జరుగుతుందని కరస్పాండెంట్ కృష్ణంశెట్టి రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు పి వినోద్ కుమార్ 6302764962, పి శ్రీకాంత్ 9964919485 నంబర్లలో సంప్రదించాలని రమేష్‌బాబు కోరారు.

అక్రమ ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలని

తహశీల్దారు కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన

తహశీల్దారు కార్యాలయంవద్ద నాయకుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

భూముల అక్రమ ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం నాయకులు అర్ధ నగర ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం పశ్చిమ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం మండల పరిధిలోని పెద్దనాగులవరం, బడేఖాన్ పేట, చింతగుంట్ల, రాయవరం, గోగిలదిన్నె, ఇడుపూర. రాజుపాలెం. బోడిచర్ల, బిరుదులనర్వ, బొందలపాడు, కోలభీమునిపాడు గ్రామాల్లో సాగులో ఉన్న రైతులకు ఆన్‌లైన్ చేయకుండా ఇతరుల పేర్లతో ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు. విచారణ జరిపి వాస్తవ సాగుదారుల పేరుతో ఆన్‌లైన్ చేయాలని డిమాండ్ చేశారు. పెద్దనాగులవరం గ్రామంలో సర్వే 71-4 ఎ.4-72 సెంట్ల భూమిలో గాలి భరత్‌కుమార్‌రెడ్డి గత 30 సంవత్సరాలు సాగులో ఉన్నట్లు తెలిపారు. అయితే ఆభూమిని గాలి విజయలక్ష్మి పేరిట ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు. బాధితులు హైకోర్టు సైతం ఆశ్రయిచడంతో కేసు విచారణలో ఉందన్నారు. అయినప్పటికీ ఆ భూమిని మరొకరి పేరుతో అసైన్మెంట్ కమిటీ సిఫారసు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. బాధితులు జిల్లా కలెక్టర్, మార్కాపురం సబ్ కలెక్టర్లను కలిసి వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్, సబ్ కలెక్టర్ నుంచి తహశీల్దారు కార్యాలయానికి ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. ఆ ఆదేశాలను రెవెన్యూ అధికారులు బేఖాతరు చేస్తున్నారని తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు అనంతరం తహశీల్దారు శ్రీనివాస్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మ బాలనాగయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, నాయకులు ఓర్సు అడివయ్య, జనుముల నాగయ్య, కె.వెంకటేశ్వరరెడ్డి, బొగ్గు రామిరెడ్డి, రమేష్, వలి, ఓర్సు వెంకటేశ్వర్లు, జీవనయ్య, భాను పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం

రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని అన్నీ ఆసుపత్రుల ల్యాబ్‌లు, స్కాన్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రెన్యువల్స్‌కు సంబంధించి జిల్లాలోని ప్రయివేటు ఆసుపత్రుల స్కాన్ సెంటర్లు, ల్యాబ్‌లు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి సూచించారు. తన ఛాంబర్‌లో ప్రోగ్రాం అధికారులతో వైద్యఆరోగ్యశాఖ అధికారి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అల్లోపతికర్ మెడికల్ కేర్ చట్టం, పిసిపిఎన్‌డిటి చ్టటం ప్రకారం జిల్లాలోని ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కాన్ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రెన్యువల్స్‌కు సంబంధించి అన్నీ ప్రయివేటు ఆసుపత్రుల స్కాన్ సెంటర్లు, ల్యాబ్‌లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఆసుపత్రులలో రోగుల వద్ద వసూలు చేసే రుసుము వివరాలు పట్టిక ఆసుపత్రి నోటిసు బోర్డులో ఉంచాలన్నారు. అంతకంటే ఎక్కువ వసూలు చేసే ఆసుపత్రులపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న వైద్యులు, ల్యాబ్ టెక్నిసియన్లు, సిబ్బంది మాత్రమే వైద్యం చేయాలని సూచించారు. ఫైర్, పొల్యూషన్ ధృవపత్రాలు, ప్రయివేటు ఆసుపత్రి రిజిస్ట్రేషన్ తప్పని సరిగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోని ఆసుపత్రులు, స్కాన్, ల్యాబ్‌లపై చట్టప్రకారం నోటీసులు ఇచ్చి సీజ్ చేస్తామని హెచ్చరించారు. స్కాన్ సెంటర్ల నిర్వాహకులు ఆడ,మగబిడ్డ విషయంలోనూ గోప్యత ప్రదర్శించాలన్నారు. లేని పక్షంలో వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈనెల 31లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో ఇళ్ల స్థలాల సమస్యపరిష్కరించాలని, ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సమావేశం తీర్మా నించింది. సమావేశ తీర్మాణాలను పార్టీ నగర కార్యదర్శి జి.రమేష్ సోమవారం పత్రికలకు విడుదల చేశారు. నగరంలో 24వేల మందికి స్థలాలు ఇస్తామని యరజర్ల కొండవద్ద స్థలాన్ని చదును చేయించి జాబితా సిద్ధం చేశారని గుర్తు చేశారు. మూడేళ్లుగా స్థలాన్ని చదును చేయడానికి డబ్బులు ఖర్చు చేయడం తప్పా అక్కడ ఒక్కరికీ పట్టాలు ఇచ్చిన పరిస్థితి లేదన్నారు. ఆ స్థలం కోర్టు వ్యవహారంలో ఉంది కాబట్టి అక్కడ పట్టాలు ఇవ్వడానికి అవకాశం లేదని తెలుస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరో చోట స్థలం కొనుగోలు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. అందుకోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. ఇళ్ల స్థలాల హామీ ఓట్లకే పరిమితం కాకూడదన్నారు. పేదల కల నెరవేలన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. ఒక్క లబ్ధిదారుడి కూడా ఇళ్లు ఇవ్వ లేదన్నారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందున్నట్లు తెలిపారు. జగన్ ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు ఇచ్చామని చెబు తుంటే ఒంగోలులో మాత్రం ఒక్కరికి కూడా స్థలం ఇవ్వలేదని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఓట్ల కోసం స్థలాల హామీ కాకుండా నిజంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. అవసరమైతే స్థలం కొనుగోలు చేసి పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

నాగులుప్పలపాడు : ఉపాధి పనులపై మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిపి నలమలపు అంజమ్మ అధ్యక్షతన ఎపిఒ, టక్నికల్ అసిస్టెంట్లు, పీల్డ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా 2021-22 లో గ్రామాల్లో కూలీలకు కల్పించిన పనులు కూలీల పనిదినాలు, అదేవిధంగా 2022-23 చేపట్టనున్న పనులకు అంచనాల తయారీపై సమీక్షించారు . రాబోవు సంవత్సరంలో కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ధనుంజయ్, టెక్నికల్ పీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి : బూచేపల్లి

నియామక ప్రతాలు అందజేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలోకి తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకరబాబు అధ్యక్షతన సచివాలయ కన్వీనర్ల ఎంపిక ప్రక్రియ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ 2024 ఎన్నికలే లక్ష్యంగా ప్రతి కన్వీనర్ పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే సుధాకరబాబు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ప్రజలలోకి వెళ్ళి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ చల్లాఅంకులు, వైస్ ఛైర్మన్ బాపతువెంకటరెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షుడు కె. శేఖరరెడ్డి, వైసిపి మండల నాయకులు చిన్నపురెడ్డి వెంకటరెడ్డి, కె.మాలకొండయ్య,జి. ఓబులరెడ్డి, భీమన వెంకటరావు, బాల కాశయ్య,మోహనరావు,సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

విద్యుత్‌శాఖ ఎస్ఇ సత్యనారాయణ

మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్ఇ సత్యనారాయణ

ప్రజాశక్తి-దర్శి

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం త్వరలో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు రానున్నట్లు విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు కెవి. సత్యనారాయణ తెలిపారు. దర్శి, పొదిలి, చీమకుర్తి డిఇ పరిధిలోని విద్యుత్‌శాఖ ఎడిఎలు, ఎఇలతో డిఇ ఎస్. అబ్దుల్ కరీం అధ్యక్షతన సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇ సత్యనారాయణ మాట్లాడుతూ 25 సంవత్సరాలు దాటి దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు మార్చి, విద్యుత్ సమస్యల పరిష్కరించి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్‌శాఖ కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రపంచబ్యాంకు ప్రతినిధులు పర్యటించి ప్రణాళికలు సిద్ధం చేస్తారని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు 25కెవి ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమైన చోట బిగిస్తామన్నారు. దర్శి ఎడిఎ పరిధిలో మూడు సంవత్సరాల కాలంలో 300 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు ఎడిఎ పిచ్చయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డిఇ సత్యనారాయణ, ఎడిఎలు శ్రీనివాసరెడ్డి, గురునాథం, దర్శి ఎఇలు ప్రసాద్, వేణుగోపాల్, అన్ని మండలాల ఎఇలు, సబ్ ఇంజినీర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిటిసి

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండల పరిధిలోని వీరరామపురం గ్రామంలో నిర్వహిస్తున్న హనుమంతునిపాడు, వెలిగండ్ల మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నందనవనం ఎంపిటిసి సూరిశెట్టి నారాయణస్వామి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని తెలిపారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సేవాదళ్ అధ్యక్షుడు కొండేపోగు రాబర్ట్, గోన దానయ్య తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులకు అధ్యాపకులు

పేస్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

టంగుటూరు : స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో వినియోగదారుల ఫోరం కమిషన్ ఆధ్వర్యంలో సోమవారం డిబేట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన ఎంబిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వందన, చైతన్య, రఫీకి వినియోగదారుల ఫోరం కమిషన్ అధికారులు ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపల్ మూర్తి, ఎంబిఎ విభాగాధిపతి మేరీజోన్స్, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు బహుమతులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

యర్రగొండపాలెం : దోర్నాల మండలం చిన్న దోర్నాలలో వాలంటీర్‌గా పని చేస్తున్న కోటేశ్వరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుంది. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కోటేశ్వరి భర్త యేసేబు సాయం చేయమని కోరడంతో యర్రగొండపాలెంకు చెందిన 1977-78 పదవ తరగతి బ్యాచ్ కలర్స్ గ్రూపు సభ్యులు అన్నమరాజు మురళీకష్ణ, తుమ్మలపల్లి కోట సుబ్బారావు, జ్యోతి ప్రసాదరావు, చేకూరి చంద్రశేఖర్, మార్కాపురంకు చెందిన శ్రీనివాసులు, శివకుమార్ తమ వంతు సహాయంగా రూ. 5000 నగదు అందజేశారు.

స్పందన అర్జీలను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామని తహశీల్దారు కె. రవీంద్రారెడ్డి తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలపై అర్జీలు అంజేశారు. అనంతరం తహశీల్దారు మాట్లాడుతూ రెవెన్యూ, ఇతర సమస్యలు ఉన్న వారు దూర ప్రాంతంలోని ఒంగోలు వెళ్లకుండా యర్రగొండపాలెంలోనే అర్జీలు అందజేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. తమ పరిధిలోని సమస్యలను మాత్రమే కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తామని తెలిపారు. స్పందన కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దుస్తులుపంపిణీ చేస్తున్న జడ ఎలీషా

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని పెరిదేపి గ్రామానికి చెందిన జెడా ఎలిషా ,అనుప దంపతుల కుమారుడు అభిషేక్ పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులు, వికలాంగులకు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎలిషా మాట్లాడుతూ యేసు జన్మించిన రోజున తమ కుమారుడు జన్మించడం తమ అదృష్టమని తెలిపారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని ప్రతి ఏటా కాలనీ వాసులకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఐజెక్ , గ్రామపెద్దలు అంగలకుర్తి చినబ్రహ్మయ్య, మల్లెల చినపేతురు, అంగలకుర్తి ఏసువర్ధన్, లక్కెపోగు పెదబ్రహ్మయ్య, అంగలకుర్తి జేమ్స్, అంగలకుర్తి ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

జాబితాలు అందుబాటులో ఉంచాలి : ఎఒ

ప్రజాశక్తి-పిసిపల్లి

ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతుల జాబితాను పూర్తి చేసి నివేదికలను అన్ని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అందుబాటులో ఉంచాలని ఎఒ జి.వెంకటస్వామి తెలిపారు. రైతు భరోసా కేంద్రాలలో సోమవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంట నష్టజాబితా నివేదిక పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ జాబితాలో తప్పులుంటే సోమ, మంగళవారాల్లో సవరణలు చేసి రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు తయారు చేసిన పంట నష్ట జాబితా నివేదిక మంగళవారం సాయంత్రం లోపు పూర్తి చేయాలన్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-దర్శి

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గుజ్జుల సరళాదేవి భవనం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గ కార్యదర్శి మాడపాకుల రమేష్‌బాబు జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసం పోరాడే పార్టీ సిపిఐ అని తెలిపారు. ఈ సందర్భంగా తన్నీరు వెంకటేశ్వర్లు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో వెలుగోటి వెంకటేశ్వర్లు, కె. హనుమంతరావు, కరుణానిధి, జూపల్లి కోటేశ్వరరావు, సుబ్బయ్య, శ్రీను, రామయ్య, వెంకటేశ్వర్లు, రామాంజి పాల్గొన్నారు. **త్రిపురాంతకం :** స్థానిక సిపిఐ కార్యాలయంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బాణాల రామయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాశిం, నాగేశ్వరరావు, ఆదినారాయణ, తిరుపతయ్య, నాగేశ్వరావు, శాంతయ్య పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** పేదల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఐ జెండాను సీనియర్ నాయకుడు చెన్నయ్య ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి గురవయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ సిపిఐ పీడిత ప్రజల కోసం వెలలేని త్యాగాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కష్ణగౌడ్, మొగిలి చిన్న వెంకటేశ్వర్లు, నక్కా తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య

ప్రజాశక్తి-టంగుటూరు

స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, ఒంగోలు డిఎస్‌పి యు. నాగరాజు తెలిపారు. స్థానిక చెల్లెమ్మ తోట బ్రహ్మంగారి గుడి సమీపంలో స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యబిరాన్ని డాక్టర్ వెంకయ్య, డిఎస్‌పి నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకయ్య మాట్లాడుతూ స్ఫూర్తి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక వైద్య శిబిరాలలో తాను పాల్గొని

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకయ్య , డిఎస్‌పి నాగరాజు

వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. శిబిరంలో చెవి, ముక్కు, గొంతు, గైనకాలజీ, ఆర్థో, ఎముకలు, కీళ్ళు, నరాలు, కంటి వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీకి చెందిన షేక్ మస్తాన్, బుచ్చిరాజుపాలెం బొడ్డు శేషమ్మ, రాయవారిపాలెం దుగ్గినేని శ్రీనివాసరావు అనే వికలాంగులకు వీల్ చైర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు, ఆదాయపన్ను శాఖ సహాయ కమిషనర్ బొడ్డు వెంకటేశ్వరరావు, బొడ్డు గ్లోరీ, సింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, విజిలెన్స్ సిఐ టిఎక్స్.అజయ్ కుమార్, ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా, స్ఫూర్తి సంస్థ ప్రతినిధులు బొడ్డు శ్రీనివాసరావు, సునీల్ కుమార్, నత్తల హరిబాబు, బొడ్డు వేణు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-తర్లుపాడు

కేక్ కట్ చేస్తున్న నాయకులు

మండల కేంద్రమైన తర్లుపాడులో ఏర్పాటు చేసిన వైసిపి కార్యాలయాన్ని ఎంపిపి సూరెడ్డి భులక్ష్మి రామ సుబ్బా రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం పూజలు నిర్వహించి కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పల్లెపోగు వరాలు, వైస్‌ప్రెసిడెంట్ వెన్నా సత్యం, వైస్ ఎంపిపి సుజాత తిరుపాలు, సొసైటీ అధ్యక్షుడు కుందురు సత్యనారాయణరెడ్డి, తాడివారిపల్లి సర్పంచి జాన్‌రత్నం, పోతలపాడు సర్పంచి గాయం శ్రీనివాసరెడ్డి, గానుగపెంట సర్పంచి బాలయ్య, రాగసముద్రం సర్పంచి రమణారెడ్డి, కలుజువ్వలపాడు సర్పంచి శిఖామణి, మంగళకుంట సర్పంచి శారద, తుమ్మలచెరువు సర్పంచి షాజహాన్, సూరేపల్లి సర్పంచి నవ్య, కొండారెడ్డి, ఎంపిటిసి తిరుపతిరెడ్డి, గొల్లపల్లి రామిరెడ్డి, తర్లుపాడు గ్రామ అధ్యక్షుడు కోలగట్ల రామకష్ణారెడ్డి, యక్కంటి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

వరికూటి అశోక్ బాబు

ప్రజాశక్తి- జరుగుమల్లి

స్థానికులతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

పేదల సంక్షేమమే ధ్యేయంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నట్లు వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు తెలిపారు. మండల పరిధిలోని పచ్చవ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు గడపగడపకూ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వారికి వివరించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం గర్భిణులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పచ్చవ సర్పంచి కొండాబత్తిన కృష్ణయ్య, నాయకులు తాటికొండ రామచంద్రరావు, కసుకుర్తి బద్రి, సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ జవహర్

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-చీమకుర్తి

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థు లను జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ జవహర్ సోమవారం అభినందించారు. ఇటీవల ఒంగోలులోని ఆనంద్ మినీ స్టేడియంలో జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్స్ హాకీ బాలుర జట్టు కోసం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చీమకుర్తికి చెందిన గణేష్, హమీద్, సంజయ్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో హాకీ కోచ్ వెంకట్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు. **సంతనూతలపాడు రూరల్ :** మండల పరిధిలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ కె. వనజ, పిఇటి టి. రవికుమార్ సోమవారం తెలిపారు. ఇటీవల ఒంగోలు మినీ స్టేడియంలో జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో టి. రోహిత్, కె.బాలాజీ, బి.మల్లికార్జున, ఎన్, విజయరాజు, ఎ.యువరాజు పాల్గొని ప్రతిభ చూపి రాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ విద్యార్థులు ఈనెల 28,29,30 తేదీల్లో విశాఖ పట్నంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో సబ్ జూనియర్ భాగంలో పాల్గొనున్నట్లు వారు తెలిపారు. ఈ

జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-వెలిగండ్ల

చీమకుర్తిలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహిస్తున్న సిఐటియు జిల్లా 12వ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రాయల మాలకొండయ్య కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా అనంతరం అధిక ధరల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల సవరణలకు కుట్ర పన్నుతున్నట్లు తెలిపారు. అందుకు వ్యతిరేకంగా సిఐటియు పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో జిల్లాలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, పని భద్రత, ప్రమాదాలు, కనీస వేతనాల గురించి చర్చించనున్నట్లు తెలిపారు. మహాసభల్లో అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మూడు గంటల పాటు వాహనాల నిలిపివేత

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దోర్నాల వద్ద ఆగిన వాహనాలు

భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ్ము సోమవారం శ్రీశైలం వచ్చారు. ఈ సందర్భంగా దోర్నాల నుంచి వెళ్లే ప్రైవేటు వాహనాలు, కార్లు, ఆర్‌టిసి బస్సులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలు నుంచి దాదాపు మూడు గంటలు పాటు దోర్నాల గణపతి చెక్‌పోస్టు సమీపంలోని మల్లికార్జున నగర్ వద్ద నిలిపి వేశారు. దీంతో వాహనాలు బారులు తీరాయి. మూడు గంటలు పాటు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా పోలీసులు గత మూడు రోజులుగా పోలీసులు నల్లమల అటవీ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. దీంతో రాష్ట్రపతి పర్యటన ప్రశాంతంగా ముగిసింది. దోర్నాల ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

అనుసంధాన రహదారి లేక ఇక్కట్లు

నిర్మించాలని అయిదు గ్రామాల ప్రజల వినతి

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం

జాతీయ రహదారి 216 నిర్మాణంతో అనేక గ్రామాల రూపు రేఖలు మారిపోయాయి. కొన్ని గ్రామాలకు పనుల చివరి అంకంలో అనుసంధాన రహదారులు నిర్మించారు. జాతీయ రహదారి 216 యాజలి గ్రామ సమీపంలో ఆనుకుని ఉన్న పుచ్చకుర్తివారిపాలెం, రామ నగరం, ఖాజీపాలెం, పోతన కట్ట వారి పాలెం తదితర గ్రామాలకు వెళ్లే మార్గం ఉంది. దీనిని ఎన్నో సంవత్సరాల క్రితం జిల్లా పరిషత్ వారు నిర్మించారు. ఇపుడు జాతీయ రహదారి అధికారులు ఈ జిల్లా పరిషత్ రోడ్డుకు అనుసంధానంగా రహదారిని నిర్మించలేదు. అదేమిటని ప్రశ్నిస్తే అసలు మా మ్యాప్‌లో ఈ రోడ్డు లేదు అని సమాధానం చెప్పారని గ్రామస్థులు అంటున్నారు. సుమారు10 వేలు పైబడిన

అసంపూర్తిగా వదిలేసిన రహదారి

జనాభా, వ్యాపార రంగం అయిన ఆక్వా అధికంగా ఉన్న ప్రాంతం నిత్యం వందలాది వాహనాలు రాకపోకలకు ఇక్కడ తీవ్ర ఆటంకంగా ఉంది. జాతీయ రహదారి కోసం ఉన్న రోడ్డును తవ్వి ఇలా చేయటం ఏమిటని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అంతేకాక గ్రామాల ప్రజలు ఒక అర్జీ ఇస్తే పరిశీలిస్తాం అని సంబంధిత రహదారి అధికారి చెప్పటం పలు అనుమానాలకు తావిస్తోంది. అయినా ప్రజోపయోగకరం అయిన జిల్లా పరిషత్ రహదారి కోసం అర్జీ ఇవ్వటం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ అనుసంధాన రహదారి లేకపోవటంతో ఈ ప్రాంతం ప్రమాదాలకు నెలవుగా మారింది. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు స్పందించి అనుసంధాన రహదారి నిర్మించి ప్రమాదాలను అరికట్టాలని సంబంధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు. లేని పక్షంలో జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తామని అంటున్నారు.

28న బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-రేపల్లె

నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ 28వ తేదీన జరుగుతాయని గుంటూరు జిల్లా యూత్ ఆఫీసర్ కిరణ్మయి దేవిరెడ్డి ఆదేశాల మేరకు రేపల్లె ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రాంగణంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు అహమ్మదీయ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ సయ్యద్ తాహేర్ అహ్మద్ పేర్కొన్నారు. ప్రధానంగా రన్నింగ్ రేస్, షార్ట్‌పుట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో అంశాలపై ఆటల పోటీలు జరుగుతాయన్నారు. గెలుపొందిన విజేతలకు నెహ్రూ యువ కేంద్ర గుంటూరు వారిచే మెడల్స్, సర్టిఫికెట్ అందజేయనున్నారు. ప్రతి సంవత్సరం గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ యువకులను నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారులు టీములుగా ఏర్పడి ఆధార్‌కార్డ్, ఫొటోలతో మీ టీమ్‌ను పిఈటి నాగేశ్వరరావును సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 9642433090 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

త్వరలో రంగా విగ్రహం ఏర్పాటు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు ● పలుచోట్ల ఘనంగా వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమాలు

ప్రజాశక్తి-రేపల్లె

ప్రజల మదిలో చిరస్మరణీయుడు స్వర్గీయ వంగవీటి మోహన రంగా అని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ అన్నారు. వంగవీటి మోహనరంగా 34వ వర్ధంతి సందర్భంగా సోమవారం నాడు రేపల్లెలోని అంకమ్మ చెట్టు సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు రంగా చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మోపిదేవి మాట్లాడుతూ రంగా చనిపోయి 34 సంవత్సరాలు అయినప్పటికీ బడుగు బలహీన వర్గాల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు. రేపల్లె పట్టణంలో త్వరలో రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు మోపిదేవి ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం రేపల్లె మండలం ఉప్పూడిలోని రంగా విగ్రహానికి వైసీపీ నాయకులు అధిక సంఖ్యలో వెళ్లి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి రాజు పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి చైర్మన్ కట్టమంగ, వైస్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ విశ్వనాథ గుప్తా, ది కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ చదలవాడ శ్రీనివాసరావు, వైసిపి రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్య బాబు, ఆంధ్ర, తెలంగాణ రాధా రంగా మిత్రమండలి కన్వీనర్ గాదే విజయ్ కుమార్, పలు మున్సిపల్ కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, రంగా అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో..

బడుగుల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగా 34 వర్ధంతి సందర్భంగా రేపల్లె తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వంగవీటి రంగా కాపు నాయకుడే కాదు అణగారిన వర్గాల నాయకుడని వక్తలు కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే తెలుగుదేశం ప్రభుత్వం కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరం మండల

రేపల్లెలో మాట్లాడుతున్న ఎంపి మోపిదేవి వెంకట రమణారావు

టీడీపీ అధ్యక్షుడు చింతల సుబ్బారావు, నియోజకవర్గ యువత అధ్యక్షుడు కొలసాని రాము, రేపల్లె టౌన్ మండల పార్టీ యువత అధ్యక్షులు దేవగిరి రవి, కమతం శివ, మాజీ సర్పంచ్ లు దామెర్ల రాజారావు, వడ్డీ లక్మోజి, పార్టీ నేతలు రేపల్లె రామాంజనేయులు, గూడవల్లి బాబూరావు, కౌన్సిలర్ అన్నె రామకృష్ణ, రేపల్లె సురేష్, పాపారావు, వడ్రే శివరామకృష్ణ, అడుసుమిల్లి భీమశంకరరావు, అల్లంశెట్టి బుజ్జి, కాంతారావు, బొర్రా అంకనాగదేవి, పివి చింతారావు, నీలా కోటేశ్వరరావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, కొండవీటి అగస్య, పర్చూరి విజయ్ కుమార్, పంతాని సాయికుమార్, బద్దెల సాయి గోపి, ఆరేపల్లి శ్రీను, జివి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: కాపు సంఘం నాయకులు దివంగత వంగవీటి మోహనరంగా వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. అద్దేపల్లికి చెందిన యువనాయకులు వేల్పురి చిన్నారి యూత్ ఆధ్వర్యంలో రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రంగా ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామని ప్రతినబూనారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి: బడుగు బలహీన వర్గాల వారిని, ఆపదలో ఉన్న వారిని ఆదుకున్న ఘనత కీర్తిశేషులు వంగవీటి మోహనరంగాదేనని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి మత్తి భాస్కరరావు అన్నారు. మోహనరంగా 34వ వర్ధంతి వేడుకలను సోమవారం గుళ్లపల్లిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. పేద ప్రజలకు,

చెరుకుపల్లిలో రంగాకు నివాళి అర్పిస్తున్న నాయకులు

బడుగు బలహీన వర్గాల వారికి మోహనరంగా అమూల్యమైన సేవలు అందించారని, వారి సేవలను నేటికీ కొనియాడుతున్నారంటే ఆయన చేసిన కృషి అభినందనీయమని భాస్కర్‌రావు అన్నారు. కార్యక్రమంలో గూడపాటి శ్రీనివాసరావు, తాతా పోలేరయ్య, అందే సాంబశివరావు, మత్తి సుధాకర్ పుల్లంగుంట శ్రీనివాస్‌రావు, కాజా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు: మండలంలోని స్వర్ణ గ్రామంలో వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమం సోమవారంనాడు జరిగింది. స్థానిక ఎంపీపీ నీరుకట్టు వాసు బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వంగవీటి అభిమానులు పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్: వంగవీటి మోహన్‌రంగా 34వ వర్ధంతి ఇంకొల్లులో ఘనంగా నిర్వహించారు. రంగా చిత్రపటానికి కాపు నాయకులు పొన్నగంటి జానకీరామారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాపుల అభివృద్ధికి రంగా చేసిన సేవలను కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బండి శివరామప్రసాద్, యు శ్రీనివాసరావు, దాసరి శ్రీను, నాగబాబు, రవి, మహేష్, ప్రవీణ్, రామోజీరావు, శ్రీదేవి, కృష్ణారావు, నరేంద్రబాబు, సలాం, నాగేశ్వరరావు, మనశ్విని తదితరులు పాల్గొన్నారు.

నగరం: మండల కేంద్రమైన నగరం సెంటర్‌లో వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమం సోమవారం జరిగింది. రంగా అనుచరుడు నాగం శ్రీనివాసరావు అలియాస్ రంగా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి ఎంపిపి మత్తి దివాకర రత్నప్రసాదు, నగరం సర్పంచ్ ఇంకొల్లు రామకృష్ణ, ఎంపిటిసి లుక్కా బాపనయ్య, స్థానిక నాయకులు వంగవీటి అభిమానులు పాల్గొన్నారు.

నగరం, ఇంకొల్లుల్లో వంగవీటి మోహనరంగాకు నివాళి అర్పిస్తున్న నాయకులు

రేపల్లెలో 'గడపగడపకూ'

ప్రజాశక్తి-రేపల్లె: రేపల్లె మండలం గుడ్డికాయలంక గ్రామంలో వైసిపి రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు అధ్యక్షతన గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు సోమవారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఏ కుటుంబానికి ఎంతెంత లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ మూడేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు సుపరిపాలన అందించారని పేర్కొన్నారు. కొంతమంది తమకు రేషన్ కార్డు రాలేదని, మరికొంతమంది ఇంటి స్థలాలు ఇవ్వలేదని ఆయన దృష్టికి తీసుకురాగా అర్హులైన వారికి ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని అధికారులకు ఆదేశించారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉయ్యూరు శ్రీనివాసరావు వెంకయ్య బాబు, పలువురు గ్రామ సర్పంచులు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వికలాంగులకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

వికలాంగులకు బ్లెస్డ్ టైమ్స్ మినిస్ట్రీ సాయం

ప్రజాశక్తి-తర్లుపాడు: తర్లుపాడు మండలంలోని ఐదుగురు వికలాంగులకు గుంటూరుకు చెందిన బ్లెస్డ్ టైమ్స్ మినిస్ట్రీ సేవా సంస్థ రూ.50 వేలను ఆర్థిక సాయంగా సోమవారం సాయంత్రం అందజేశారు. వికలాంగురాలైన గుంటు మరియమ్మకు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. అలాగే మరో నలుగురికి వడ్డీ లేకుండా రూ.10 వేల చొప్పున రుణ సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ పల్లెపోగు వరాలు, సంస్థ అధ్యక్షులు కే హేమలత, ఎం గోపీనాథ్, వెలుగు ఏపిఎం పిచ్చయ్య, వైసీపీ నాయకులు ఎబినేజర్, చర్చి పాస్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోటయ్య వృద్ధాశ్రమంలో బియ్యం అందజేస్తున్న వాకర్ అసోసియేషన్ సభ్యులు

వృద్ధాశ్రమానికి బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-చీరాల: వృద్ధాశ్రమాలకు చేయూతనందిస్తూ వృద్ధులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. సోమవారం ఎన్ఆర్అండ్ పిఎం హైస్కూల్ గ్రౌండ్లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పచ్చిపులుసు వెంకటస్వామి పుట్టినరోజు సందర్భంగా చీరాలలోని కోటయ్య వృద్ధ ఆశ్రమానికి 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా దండుబాటులోని కోటయ్య వద్ధ శరణాలయానికి 50 కేజీల బియ్యాన్ని ఆశ్రమం నిర్వాహకులు శ్యామ్‌కి అందజేశామన్నారు. సభ్యుల పుట్టినరోజు సందర్భంగా సేవ చేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను తమ అసోసియేషన్ సభ్యులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అమర వీరాంజనేయులు, పోలు దాసు రామకృష్ణ, సుభాషిని, వలివేటి మురళీకృష్ణ, డేగల తిరుపతిరావు, డివి సురేష్, చింత రమేష్, దరియా సాహెబ్, పూర్ణచంద్రరావు, గురు ప్రసాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ రాజ్యలక్ష్మి

హైరిస్క్ గర్భవతులను గుర్తించండి

వైద్యాధికారులకు డిఎంహెచ్ఒ ఎస్.రాజ్యలక్ష్మి ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

హైరిస్క్ గర్భవతులు, తల్లులను 3-4 రోజులు ముందస్తుగా గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రులలో చేర్చి వైద్యచికిత్స అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక డిఎంహెచ్ఒ ఛాంబర్లో సోమవారం కన్వర్జెన్సీ మీటింగ్ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ సర్వజన ఆసుపత్రిలో 10 పడకలు, ఎంసిహెచ్లో 10 పడకలు, జిల్లా ఆసుపత్రిలో 10 గపడకలు, ఏరియా ఆసుపత్రిలో ఐదు పడకలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్లో 3 పడకలు చొప్పున ప్రత్యేకంగా హైరిస్క్ గర్భవతులకు కేటాయించాలన్నారు. మాతా, శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హై రిస్క్ గర్భవతులను గుర్తించి మూడు లేదా నాలుగు ముజుల ముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు తెలియజేయాలన్నారు. సమీపంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఏరియా ఆసుపత్రి, జిల్లా ఆసుపత్రులకు తెలియజేయాలన్నారు. విషయాన్ని తెలియజేసిన వెంటనే అన్ని సౌకర్యాలు సిద్ధం చేసుకుంటారన్నారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎస్ఎన్ మూర్తి, జిజిహెచ్ వైద్యులు డాక్టర్ చైతన్య వంశీ, డాక్టర్ సంపూర్ణమ్మ, డిపిహెచ్ఎన్ఒ సుగుణమ్మ, మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు వింటున్న జేసీ శ్రీనివాసులు

స్పందన అర్జీలపై దృష్టి సారించాలి

జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్పందన అర్జీలపై అధికారులు దృష్టి సారించాలని, గడువులోగా పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. స్పందన కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. స్పందన అర్జీలపై ప్రతిరోజూ అధికారులు దష్టి సారించాలని చెప్పారు. ప్రతి సోమవారం డివిజన్, మండల స్థాయి అధికారులతో సమీక్షలు జరపాలన్నారు. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంతో పనిచేయాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డి.ఆర్.ఒ కె.లక్ష్మీశివజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మరింత తేజోవంతంగా ఉన్న సూర్యుడు

మండే అగ్నిగోళంలా సూర్యుడు

ప్రజాశక్తి-చీరాల

సోమవారం సాయంత్రం వేళలో ఎప్పుడూ లేని విధంగా సూర్యుడు వెలుగులు విరజిమ్ముతూ.. మండే అగ్నిగోళంలా కనిపించాడు. ఈ దృశ్యాలను పట్టణ పురవాసులు తమ సెల్ఫోనులో బంధించే పనిలో నిమగ్నమయ్యారు. సాయంత్రం వేళ ప్రశాంతంగా కనిపించే సూర్యుడు.. భారీస్థాయిలో వెలుగులు ప్రసరిస్తూ.. అస్తమించడం గమనార్హం. చీరాల రైల్వే బ్రిడ్జి పైన వాహనదారులకు ఈ అరుదైన దశ్యం స్పష్టంగా కనిపించింది.

'స్పందన' అర్జీల పరిష్కారంలో

జాప్యాన్ని సహించను

- నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వానికి సరెండర్..
- అధికారులకు కలెక్టర్ దినేష్కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్పందన అర్జీలను పరిష్కరించటంలో, కోర్టు కేసులలో సకాలంలో స్పందించక జాప్యం చేస్తే సహించబోనని కలెక్టర్ ఏఎస్.దినేష్కుమార్ ఆదేశించారు. స్థానిక స్పందన సమావేశ మందిరంలో సోమవారం స్పందన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలను త్వరగా, సహేతుకంగా క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని పునరుద్ఘాటించారు. పిటీషన్లు రీఓపెన్ కాకుండా చూడాలని, కింది స్థాయి వీటిని పరిష్కరిస్తున్న తీరుపై జిల్లా అధికారులు నిశితంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. తమ శాఖలకు సంబంధించి కోర్టులలో దాఖలయ్యే ధిక్కరణ పిటీషన్ల స్థితిగతులను రెగ్యులర్గా జిల్లా అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. వీటికి ఎప్పటికప్పుడు కౌంటర్ పిటీషన్లు దాఖలు చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే జిల్లాలో పనిచేయకుండా ప్రభుత్వానికి సరెండ్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ దినేష్కుమార్

డయల్ యువర్ కలెక్టర్కి విశేష స్పందన

తొలుత డలల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ప్రజల ఫోన్ ద్వారా వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వీటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

- కొమరోలు మండలం, పామూరుపల్లె నుంచి జి.రమణారెడ్డి ఫోన్ చేసి సిమెంట్ రోడ్డులు ఆక్రమించి గోడ కడుతున్నారని ఫిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.
- ఇదే గ్రామం నుంచి పి.సుధాకర్ రెడ్డి ఫోన్ చేసి సర్వే నెంబర్ 1179/2లో తమ పట్టా భూమిని ప్రభుత్వ భూమిగా అధికారులు చెబుతున్నారని, పరిశీలించి న్యాయం చేయాలని కలెక్టర్ను కోరారు.
- పెద్దారవీడు మండలం, తోకపల్లి నుంచి సిహెచ్ వెంకటేశ్వర్లు ఫోన్ చేసి తమ పొలాన్ని వేరే వారి పేరుతో ఆన్లైన్ చేశారని, ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందిస్తూ పరిశలించి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.
- కనిగిరి మండలం పునుగోడు నుంచి ఎం.చిన్న వెంకట సుబ్బయ్య ఫోన్ చేసి తమ సమస్యను పరిష్కరించాలని ఆర్డీవోకు చెప్పినా పరిష్కారం కాలేదని ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ఈ విషయాన్ని అధికారులు పరిశీలించాలని సూచించారు.

కార్యక్రమంలో జెసి ఎం.అభిషిక్త్ కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సరళా వంద, గ్లోరియా, ఉమాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి సురేష్కు మాతృవియోగం

- జార్జి విద్యాసంస్థల చైర్మన్ 'థెరిసమ్మ' మృతి
- జార్జి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ముగిసిన అంత్యక్రియలు
- నివాళులర్పించిన ప్రముఖులు

ప్రజాశక్తి-మార్కాపురం

జార్జి విద్యా సంస్థల చైర్మన్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాతృమూర్తి చెరుకూరి థెరిసమ్మ (85) ఆదివారం అర్ధరాత్రి సమయంలో కన్నుమూశారు. థెరిసమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. హైదరాబాద్లోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించడంతో మృతిచెందారు.

ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా థెరిసమ్మ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారు. ఆమె భర్త, కీర్తిశేషులు డాక్టర్ శామ్యూల్ జార్జి కూడా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు. థెరిసమ్మ, డాక్టర్ శామ్యూల్ జార్జి ఎక్కడ పని చేసినా... ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయడమే కాకుండా ఆయా పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారంగా సాయం అందించేవారు. మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు థెరిసమ్మ మొదటి ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేశారు.

ఆ తరువాత జార్జి విద్యా సంస్థలను స్థాపించారు. కర్నూలు, మార్కాపురంలో జార్జి విద్యాసంస్థలను నెలకొల్పారు. ప్రకాశం జిల్లాలో మొట్టమొదటగా ఇంజనీరింగ్ కళాశాలను డాక్టర్ శామ్యూల్ జార్జి స్థాపించడం వెనక థెరిసమ్మ కృషి ఎనలేనిది. డాక్టర్ శామ్యూల్ జార్జి స్వగ్రామం మార్కాపురం మండలంలోని గజ్జలకొండ. ఈ ప్రాంత విద్యాభివృద్ధికి కృషి చేయాలనే ఆలోచనతో పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం కేంద్రంగా డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలను పాతికేళ్ల క్రిందట స్థాపించారు. ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో జార్జి ఇంజనీరింగ్ కళాశాల ఒకటిగా నిలిచింది. ఇంజనీరింగ్ కళాశాలతో పాటు జార్జి ఫార్మసి కళాశాలను కూడా స్థాపించారు. మారుమూల ప్రాంతమైన మార్కాపురం ప్రాంతంలో ఎందరో పేద విద్యార్థుల ఉన్నత చదువులకు బంగారు బాటలు వేశారనడంలో అతిశయోక్తి లేదు.

డాక్టర్ శామ్యూల్ జార్జి మృతిచెందిన తరువాత జార్జి విద్యాసంస్థల చైర్మన్ బాధ్యతలను థెరిసమ్మ నిర్వహించారు. శామ్యూల్ జార్జి-థెరిసమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారిలో డాక్టర్ ఆదిమూలపు సురేష్ రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్నారు. డాక్టర్ సతీష్ జార్జి విద్యా సంస్థల సెక్రటరీగా పనిచేస్తున్నారు. పెద్ద అల్లుడు తిప్పేస్వామి మడకశిర ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

థెరిసమ్మ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

థెరిసమ్మ భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి మార్కాపురంలోని స్వగృహానికి సోమవారం ఉదయం ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చారు. ప్రజల సందర్శనార్థం జార్జి గెస్ట్హౌస్లో సాయంత్రం నాలుగు గంటల వరకు ఉంచారు. ఆ తరువాత వైకుంఠ రథంపై ఊరేగింపుగా అంతిమయాత్ర మార్కాపురం పురవీధుల గుండా దరిమడుగు సమీపంలోని జార్జి ఇంజనీరింగ్ కళాశాల వరకు సాగింది. అక్కడ చర్చిలో ప్రత్యేక ప్రార్ధన అనంతరం జార్జి ఫూట్ సమీపంలో థెరిసమ్మ భౌతికకాయానికి అంత్యక్రియలు పూర్తిచేశారు.

ప్రముఖుల నివాళి

మంత్రి సురేష్ మాతృమూర్తి థెరిసమ్మ మృతి చెందిన విషయం తెలుసుకుని పలువురు ప్రముఖులు మార్కాపురం చేరుకున్నారు. జార్జి గెస్ట్హౌస్లో సందర్శనార్థం ఉంచిన థెరిసమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆ తరువాత మంత్రి సురేష్తో పాటు ఆయన సోదరుడు డాక్టర్ సతీష్ను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో కలెక్టర్ దినేష్కుమార్, జిల్లాపరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్కుమార్, వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, టిడిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సిపిఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య, సిపిఐ కార్యదర్శి అందె నాసరయ్య, లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, పందీటి కాశీరావు మాదిగ, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఒ ఓబులేసు, డిఆర్డిఎ పిడి బాబురావు, మెప్మా పిడి రవికుమార్, మార్కాపురం మున్సిపల్ కమిషన్ బిఎస్ గిరికుమార్, పొదిలి మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్ జోషఫ్లతో పాటు పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఉన్నారు.

థెరిసమ్మ మృతి తీరని లోటు

మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తల్లి థెరిసమ్మ మృతి తీరని లోటని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రి ఆదిమూలపు సురేష్ను ఎమ్మెల్యే బాలినేని ఫోన్లో పరామర్శించారు.

మాగుంట సంతాపం

మంత్రి సురేష్ తల్లి థెరిసమ్మ ఆకస్మిక మృతి పట్ల ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతాపం ప్రకటించారు. ఆమె మరణ వార్త తనకు ఎంతో దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్కు, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

'దామచర్ల' సంతాపం

మంత్రి ఆదిమూలపు సురేష్ మాతృమూర్తి ఆదిమూలపు థెరీసమ్మ అకాల మృతికి ఒంగోలు మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్రావు సంతాపం తెలిపారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు కుందురు నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి